

బాటసారులకు నీడ !

బాటసారులకు ఏళ్ల తరబడి దెందుకూరులో నీడ కల్పించిన సత్రం స్థానంలో కొత్త భవనం నిర్మించిన దాతలు పెద్ద మనస్సు చాటారు. 8లో



ప్రభుత్వాలవి ఫాసిస్టు చర్యలు

మావోయిస్టుల మృతదేహాలను అప్పగించకుండా పాలకులు ఫాసిస్టు చర్యలకు పాల్పడుతున్నారని మాస్‌లైన్ నేత రంగారావు విమర్శించారు. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 25°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

20 పడకలతో కోవిడ్ వార్డు



పెద్దాస్పత్రిలో తెరిచిన కోవిడ్ వార్డు

ఖమ్మంవైద్యవిభాగం: దేశంలోని పలు ప్రాంతాల్లో కరోనా కేసులు నమోదవుతున్నాయనే సమాచారంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈమేరకు సోమవారం ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కోవిడ్ ప్రత్యేక వార్డు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇరవై పడకలతో ఈ వార్డును ఏర్పాటు చేయగా, అనుమానిత కేసులు ఉంటే వారికి చికిత్స చేయనున్నారు. అయితే, కరోనా సోకినట్లు గుర్తించడానికి జిల్లాలో ర్యాపిడ్ కిట్లు కానీ ఆర్‌టీపీసీఆర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు లేకపోవడం గమనార్హం. ఈనేపథ్యాన జిల్లాకు 3వేల కిట్లు సరఫరా చేయాలని ఉన్నతాధికారులకు నివేదించారు. కాగా, కరోనా వ్యాప్తి చెందకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మాస్కులు ధరించడమే కాక గుంపులు గుంపులుగా సంచరించొద్దని అధికారులు సూచిస్తున్నారు. అలాగే, శానిటైజర్‌తో చేతులు తరచూ శుభ్రం చేసుకోవాలని, జ్వరం, జలుబు, దగ్గు ఉంటే వైద్యులను సంప్రదించాలని అవగాహన కల్పిస్తున్నారు.

ఏకలవ్య కళాశాలల్లో వంద శాతం సీట్లు భర్తీ

భద్రాచలం అర్బన్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కళాశాలల్లో జూనియర్ ఇంటర్‌లో ఖాళీగా ఉన్న 302 సీట్ల భర్తీకి సోమవారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. భద్రాచలంలోని ఈఎంఆర్‌ఎస్ కళాశాలలో కన్వీనర్ నాగేశ్వరరావు, ఆర్‌సీఓ అరుణకుమారి నేతృత్వాన కౌన్సెలింగ్ ఏర్పాటుచేయగా 577 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఖాళీగా ఉన్న 302 సీట్లలో మెరిట్ ప్రకారం విద్యార్థులకు ప్రవేశాలు కల్పించినట్లు భద్రాచలం కళాశాల ప్రిన్సిపాల్‌వందనాబీ దాస్ తెలిపారు. దీంతో కళాశాలల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు విజయ్‌కుమార్, సంజయ్ మల్కర్, ప్రశాంత్, నితిన్‌సింగ్, విజయేంద్ర సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెలలో 30వరకు బియ్యం పంపిణీ



రేషన్ షాప్‌లో నిల్వలను పరిశీలిస్తున్న డీసీఎస్‌ఓ చందన్‌కుమార్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని రేషన్‌షాప్‌ల ద్వారా లబ్ధిదారులకు మూడు నెలలకు సంబంధించిన బియ్యాన్ని జూన్‌లో ఒకేసారి అందించనున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ తెలిపారు. ఈమేరకు సోమవారం ఆయన పలు రేషన్‌షాపులను తనిఖీ చేసి బియ్యం నిల్వలు, షాప్‌ల సామర్థ్యాన్ని పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో 4,15,905 కార్డులకు గాను 12,03,943మంది లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. వీరికి 21,915.321మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తామని డీసీఎస్‌ఓ వెల్లడించారు. మూడు నెలలకు సంబంధించి ఒకేసారి బియ్యం ఇవ్వనున్న నేపథ్యాన జూన్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పంపిణీ ఉంటుందని తెలిపారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

ఖమ్మం సహకారనగర్: బాలికలు, మహిళ రక్షణను అందరూ బాధ్యగా భావించాలని జిల్లా విద్యాశాఖాధికారి సామినేని సత్యనారాయణ సూచించారు. ఖమ్మం రిక్కాబజార్ హైస్కూల్‌లో జిల్లా విద్యాశాఖ, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన రెండు రోజుల పాటు ఇవ్వనున్న శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆడపిల్లల అక్రమ రవాణా, డ్రగ్స్ కారణంగా ఎందరో అమ్మాయిలు, అబ్బాయిల జీవితాలు నాశనమవుతున్నాయని తెలిపారు. ఈనేపథ్యాన విద్యార్థినీ, విద్యార్థులతో సన్నిహితంగా ఉండే ఉపాధ్యాయులు వారి సామాజిక, మానసిక స్థితిగతులను పరిశీలిస్తూ రక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. ఉమ్మడి జిల్లా జీసీడీఓ అన్నమణి, హెచ్‌ఎం అజిత, ప్రజ్వల సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్, రిసోర్స్ పర్సన్ సురేష్‌కుమార్‌తో పాటు రాము తదితరులు పాల్గొన్నారు.

అదే పంథా.. ఆగని దందా



కింద రిజిస్ట్రార్ కార్యాలయం, పై అంతస్తులో డాక్యుమెంట్ రైటర్ల ఆఫీస్‌లు

అడుగడుగునా అక్రమాలే

జిల్లాలో గతంలో పనిచేసిన అధికారులను మార్చి కొత్త వారిని నియమించినా అవినీతి ఆగకపోవడం గమనార్హం. తాజాగా ఏసీబీ అధికారుల వలలో చిక్కిన ఖమ్మంరూరల్ సబ్ రిజిస్ట్రార్ జె.అరుణ వ్యవహార శైలిపై కొన్ని నెలలుగా ఆరోపణలు వస్తున్నాయి. మూడు నెలల క్రితం ఆమెపై కొందరు ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు కూడా చేశారు. అయినా తీరు మార్చుకోని ఆమె.. కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి టార్గెట్లు విధించి వారి ద్వారా వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఏకంగా వెండర్లకు స్టాంప్‌లు విక్రయించడంలోనూ అదనపు వసూళ్లకు పాల్పడ్డారన్న ఫిర్యాదులొచ్చాయి. ఇవన్నీ భరించలేక ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పట్టుబడడం గమనార్హం.

స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతి తిమింగలాలు

- ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్
- జిల్లాలు మార్చినా మారని తీరు
- ఏసీబీ అధికారుల వలలో చిక్కిన ఖమ్మం రూరల్ సబ్‌రిజిస్ట్రార్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం తీసుకొచ్చే వాటిలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మొదటి స్థానంలో ఉంటుంది. అయితే, ఈ శాఖలో ఎన్ని మార్పులు, చేర్పులు చేసినా.. సంస్కరణలు తీసుకొచ్చినా గాడిన పడడం లేదన్న విమర్శలున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాల్లో జరుగుతున్న అక్రమ రిజిస్ట్రేషన్లు, దందా చర్చనీయాంశంగా మారుతోంది. కొందరు అధికారుల తీరుతో శాఖ మొత్తానికి మచ్చ పడుతోందని చెబుతున్నారు. అవినీతిపరులైన అధికారుల స్థానాలు మార్చినా, జిల్లాలు దాటించినా పాత వాసనలు మాత్రం వీడడం లేదు. వైరా కార్యాలయంలో ఒకేరోజు 100మేర డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్ సస్పెండ్ కాగా.. ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్ జె.అరుణ డాక్యుమెంట్ రైటర్ ద్వారా రూ.30వేలు లంచం తీసుకుంటూ సోమవారం ఏసీబీకి పట్టుపడ్డారు. ఇలాంటి ఘటనలతో శాఖలో అవినీతి దందా ఆగలేదని స్పష్టమవుతోంది.

ప్రైవేట్ సైన్యం అండతో...

కార్యాలయాలకు రిజిస్ట్రేషన్ కోసం వచ్చే భూయజమానులకు డాక్యుమెంట్లు సమకూర్చేందుకు రైటర్లు ఉంటారు. ప్రతీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్లు ఏళ్లుగా జీవనాధారం పొందుతున్నారు. అయితే, వీరిని ఆలంబనగా చేసుకుని సబ్ రిజిస్ట్రార్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఏ పని అయినా డాక్యుమెంట్ రైటర్ ద్వారా వస్తే త్వరగా అవుతుందని, నేరుగా వెళ్తే పని కాదనే నమ్మకం ఏర్పడడంతో భూయజమానులంతా తొలుత వీరిని ఆశ్రయించాల్సి వస్తోంది. ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఓ అధికారి.. ప్రైవేట్ వ్యక్తులను డాక్యుమెంట్ రైటర్లుగా వినియోగించుకున్నారు. వీరు ఏకంగా ప్రభుత్వ స్థలాన్నే రిజిస్ట్రేషన్ చేయించి అక్రమాలకు పాల్పడ్డారు. ఈ ఘటనలో సదరు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌పై వేటు పడింది. సోమవారం కూడా డాక్యుమెంట్ రైటర్ మధ్యవర్తిగా వ్యవహరించి సబ్ రిజిస్ట్రార్ తరఫున నగదు తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద డాక్యుమెంట్ రైటర్ల ఆగడాలు పెరిగిపోయాయని, వారు అధికారులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ.. దస్త్రాల రిజిస్ట్రేషన్‌కు వచ్చే వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు సైతం తమ చేతికి మట్టి అంటకుండా వీరి ద్వారానే వసూళ్లకు పాల్పడుతున్నారనే అంశం నిరూపితమవుతోంది.



జిల్లాలో అనేకం..

గత నాలుగైదేళ్లలో జిల్లాలోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో అనేక అవినీతి అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. 2021లో ఖమ్మంరూరల్ సబ్ రిజిస్ట్రార్ ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేసి సస్పెండ్‌కు గురయ్యారు. ఇక 2020 మే నెలలో మధిరలోని ఎక్సైజ్ కార్యాలయ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసిన ఘటనలో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌పై వేటు పడింది. వీటితోపాటు అనేక స్థలాలను నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రిజిస్ట్రేషన్లు చేసి పలువురు సబ్ రిజిస్ట్రార్లు సస్పెన్షన్లకు గురైన ఘటనలు ఉన్నాయి. కూసుమంచి, వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ల అక్రమాలు బయటపడడంతో విధుల నుంచి తొలగించారు. ఈ అవినీతిని నిర్మూలించాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా శాఖను ప్రక్షాళన చేస్తూ సీనియర్ అసిస్టెంట్ నుంచి సబ్‌రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్ స్థాయి అధికారులందరినీ ప్రస్తుత స్థానాల నుంచి పక్క జిల్లాలకు బదిలీ చేయించారు.

శుద్ధి.. అబద్ధం

- జిల్లాలో పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్లు
- మినరల్ పేరుతో జనరల్ వాటర్ అమ్మకం
- ఏ ప్లాంట్‌లోనూ కనిపించని నిపుణులు, పరీక్షలు
- అయినా తనిఖీల మాటే ఎత్తని అధికార యంత్రాంగం



ఓ ప్లాంట్‌లో పరీక్షలు లేకుండానే క్యాన్లలో నీరు నింపుతున్న దృశ్యం



స్టీల్ డ్రమ్ముకు బదులు ప్లాస్టిక్ డ్రమ్ములో నీరు తీసుకెళ్తూ....

ఖమ్మంరూరల్: ప్రజలకు ఆరోగ్యంపై పెరుగుతున్న శ్రద్ధ, ఆపై మండుతున్న ఎండలతో మినరల్ వాటర్ కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. దీన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నకొందరు గల్లీకొకటి చొప్పున మినరల్ వాటర్ పేరిట ప్లాంట్లు ఏర్పాటుచేసి సాధారణ నీటినే అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని ప్లాంట్లు అయితే కిరాణం షాపులు, చిన్న బడ్డీ కొట్లు, రోడ్ల వెంట షెడ్లలో ఏర్పాటుచేయడం గమనార్హం. కేవలం ఒక పెద్ద ట్యాంక్, మరో రెండు బాయిలర్ మాదిరి ట్యాంకులు.. అన్నింటినీ అనుసంధానిస్తూ పైప్‌లు ఏర్పాటు చేసి ఇవే మినరల్ వాటర్‌గా అమ్ముతున్నారు. జిల్లాలో ఇలాంటి వెయ్యికి పైగా ప్లాంట్లు ఉన్నాయని తెలుస్తుండగా.. పదుల సంఖ్యలో కూడా అనుమతి లేవని సమాచారం. అయినప్పటికీ అధికారులు మిగతా సమయాల్లో ఏమో కానీ కనీసం వేసవిలోనైనా ఏ ప్లాంట్‌లోనూ తనిఖీ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఫిల్టర్ నీరే...

వాటర్ ప్లాంట్లలో నీరు శుద్ధి చేయకపోగా సాధారణ ఫిల్టర్ల నీటినే క్యాన్లలో నింపి సరఫరా చేయడం పరిపాటిగా మారింది. వేసవి తాపం నుంచి బయటపడేందుకు చల్లని నీటి కోసం వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తే మరింత ఎక్కువ ధర వసూలు చేస్తున్నారు. గల్లీలో ఉన్న డబ్బా కొట్టు మొదలు హోటళ్లు, రెస్టారెంట్లు, అపార్ట్‌మెంట్లు, శుభకార్యాలకు జనరల్ వాటర్‌నే మినరల్ వాటర్ పేరిట సరఫరా చేస్తున్నారు. దీంతో ప్రజలు డబ్బు చెల్లించి మరీ అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నట్లవుతోంది.

నిబంధనలకు చెల్లుచీటీ

జిల్లా వ్యాప్తంగా వెయ్యికి పైగా వాటర్ ప్లాంట్లు ఉన్నట్లు అంచనా. ఏ ప్లాంట్‌లో కూడా నీటిశుద్ధికి కనీస ప్రమాణాలు పాటించడం లేదని చెప్పొచ్చు. నాలుగైదు మినహాయించి మిగతా ప్లాంట్లకు బీఎస్‌ఐ(బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్) గుర్తింపు లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక ఇళ్లకైతే ఒక ధర, హోటళ్లు, బార్లకైతే ఇంకాస్త తక్కువ ధరకే నీటి అమ్మకాలు చేస్తున్నారు. ఇలా ఇంటింటికీ సాధారణ నీరే సరఫరా చేస్తున్న నిర్వాహకులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనలు ఇలా....

వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే సంబంధిత అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి. అలాగే, ప్లాంట్లలో ల్యాబ్ ఏర్పాటు చేసి కెమిస్టులు, మైక్రో బయాలజిస్టులను నియమించాలి. వీరి ఆధ్వర్యాన ప్రతీరోజు నీటి పరీక్షలు చేశాకే సరఫరా చేయాలి. క్యాన్లను పొటాషియం పర్మాంగనేట్‌తో శుభ్రం చేయాలి. అలాగే, నీటిని నింపే ముందు క్యాన్‌ను అల్ట్రా వైలెట్ రేస్‌తో శుభ్రపర్చాలి. అంతేకాక, సిబ్బంది చేతులకు గ్లౌస్‌లు వాడాలి. శుద్ధి చేసిన నీటిని 304 గ్రేడ్ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారు చేసిన పెద్ద ట్యాంక్‌లో నింపి ఓజోనైజేషన్ చేయాలి. అలాగే, క్యాన్లపై ధర, ప్లాంట్ పేరు, ఇతర వివరాలన్నీ ముద్రించాలి. కానీ జిల్లాలోని ఏ ప్లాంట్ నుంచి సరఫరా అవుతున్న క్యాన్‌ను పరిశీలించినా ఇవేవీ కనిపించవు.

అధికారుల పర్యవేక్షణ ఏదీ?

వాటర్ ప్లాంట్లను నిత్యం తనిఖీ చేయాల్సిన అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదు. ప్రజల ప్రాణాలతో ముడిపడిన ప్లాంట్ల విషయంలో మున్సిపాలిటీ, రెవెన్యూ, ఆహార భద్రత, పర్యావరణ, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర అధికారులు ఏ మాత్రం పట్టించుకున్న దాఖలాలే లేవు. తరచూ పర్యవేక్షిస్తూ నీటిని ప్రయోగశాలలో పరిశీలించాల్సి ఉన్నప్పటికీ ఎవరైనా ఫిర్యాదు చేస్తే మొక్కుబడిగా తనిఖీ చేయడం.. ఆపై చర్యల విషయంలో మీనమేషాలు లెక్కించడం పరిపాటిగా మారింది. ఇకనైనా అధికారులు స్పందించి అనధికారిక మినరల్ వాటర్ ప్లాంట్లపై కఠినంగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వ బడుల్లో ప్రవేశాల పెంపునకు కృషి

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రవి



జాతాను ప్రారంభిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి

ఖమ్మంసహకారనగర్: అన్ని వసతులు, నాణ్యమైన బోధన అందుతున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, తద్వారా ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు కోసం యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన ప్రచార జాతాను ఖమ్మంలో సోమవారం ప్రారంభించి మాట్లాడారు. సుశిక్షితులైన ఉపాధ్యాయులు, విశాలమైన తరగతి గదులు, ఆటస్థలాలు ఉండడమే కాక ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, నాణ్యమైన మధ్యాహ్న భోజనం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే అందుతాయని తెలిపారు. కాగా, తొలిరోజు ఖమ్మంలోని వైరా రోడ్డు, పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్, ఇల్లెందు క్రాస్ రోడ్డు తదితర ఏరియాల్లో ప్రచార జాతా కొనసాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావుతో పాటు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, బుర్రి వెంకన్న, వల్లంకొండ రాంబాబు, బానోత్ రాందాస్, లివిన్‌స్టన్, ధర్మసోత్ నాగేశ్వరరావు, పినపాక సురేష్, కట్టా పద్మ, వి.దామోదర్, ఉద్దండ్, మంగీలాల్, నెల్లూరి వీరబాబు, ఏడునూతల రవికుమార్, జి.బిక్షపతి, యు.నాగేశ్వరరావు, డి.శ్రీనివాస్, శివకోటి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు అవకాశం

ఖమ్మంమయూరిసెంటర్: డీజిల్ మెకానిక్ ట్రేడ్‌లో ఐటీఐ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు ఖమ్మం రీజియన్‌లోని ఆర్టీసీ డిపోల్లో అప్రెంటిస్‌షిప్ అవకాశం కల్పిస్తున్నట్లు ఆర్‌ఎం ఏ.సరిరామ్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అర్హత కలిగిన అభ్యర్థులు అప్రెంటిస్‌షిప్ ఇండియా వెబ్‌సైట్‌లో టీజీఎస్ ఆర్టీసీ లొకేషన్‌ను ఎంపిక చేసి వివరాలు నమోదు చేయాలని సూచించారు. అలాగే, ఎస్సెస్సీ, ఐటీఐ మెమోలు, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాస్‌బుక్ మొదటి పేజీ అప్‌లోడ్ చేయాలని తెలిపారు. జూన్ 10వ తేదీ లోపు నమోదుకు అవకాశముందని ఆర్‌ఎం ఓ ప్రకటనలో వెల్లడించారు.

ఉద్యోగులంతా స్థానికంగానే ఉండాలి...

ఖమ్మంవన్‌టౌన్: ఈ ఏడాది రుతుపవనాలు ముందుగా వస్తాయనే వాతావరణ శాఖ సూచనల ఆధారంగా జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమవుతోంది. వర్షాకాలంలో ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేలా గ్రామపంచాయతీతో పాటు అన్ని శాఖల ఉద్యోగులు ఉద్యోగ కేంద్రాల్లోనే నివసిస్తూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. జూన్ నుండి సెప్టెంబర్ వరకు ఉద్యోగులెవరూ హెడ్‌క్వార్టర్ వదిలివెళ్లొద్దని సోమవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు అన్ని శాఖల ఉద్యోగులు, రాజకీయ నాయకులు, యూత్ సభ్యులను సమన్వయం చేసుకుంటూ 'ఆపద మిత్ర' పేరుతో వాట్సప్ గ్రూప్‌ను ఏర్పాటుచేసి వరదల సమాచారంతో అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అలాగే, మైక్ సిస్టం, బ్యాటరీలు సిద్ధం చేసుకోవాలని, వరద వస్తే లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించేలా పునరావాస కేంద్రాలను గుర్తించాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు విలువైన పత్రాలను భద్రపరుచుకునేలా సూచనలు చేయాలన్నారు. ఇక వర్షాకాలంలో నీరు కలుషితం కాకుండా పైప్‌లైన్లు లీకేజీలను మరమ్మతు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఫిర్యాదులను పరిష్కరించండి

'గ్రీవెన్స్ డే'లో అదనపు కలెక్టర్ శ్రీజ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సహకారనగర్: ప్రజలు ఇచ్చే ప్రతీ దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో ప్రజావాణి(గ్రీవెన్స్ డే)లో భాగంగా సోమవారం ఆమె మరో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ఫిర్యాదులు, దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమైన శ్రీజ మాట్లాడుతూ ప్రజలు అందించిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో డీఆర్వో పద్మశ్రీ, డీఆర్‌డీఓ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు కొన్ని...

- ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెంకు బి.సీతమ్మ, షేక్ రజియా సుల్తానా, ఎం.సావిత్రి తదితరులు తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని చెప్పి ఇప్పుడు రెండో విడతగా వస్తాయని అంటున్నారని ఫిర్యాదు చేశారు. ఇళ్లను తమకు మొదటి దశలోనే ఇప్పించాలని కోరారు. అలాగే, వేంసూరు మండలం కుంచపర్తికి చెందిన కర్రి దుర్గ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని విన్నవించారు.
- బోనకల్ మండలం తూటికుంట్ల గ్రామానికి చెందిన పి.రాంబాబు ఉపాధి హామీ పథకం పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు.
- తల్లాడ మండలం బాలప్పేటకు చెందిన జి.వీరయ్య 2008 నుంచి గ్రామంలో ఉపాధి హామీ పథకం సీనియర్ మేట్‌గా పనిచేస్తున్నాడు. దీంతో తనకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా అవకాశం ఇవ్వాలని కోరారు.

ప్రారంభానికి ముస్తాబు

- పాఠశాలల్లో చివరి దశకు అభివృద్ధి పనులు
- బడి మొదలయ్యే నాటికి పూర్తయ్యేలా పర్యవేక్షణ
- తద్వారా తీరనున్న విద్యార్థుల ఇక్కట్లు



చింతకాని హైస్కూల్‌లో పనులపై ఆరా తీస్తున్న అధికారులు

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వ విద్యాసంస్థల్లో అన్ని వసతులు సమకూర్చేలా మంజూరైన నిధులతో చేపట్టిన పనులు చకచకా కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వం (2022–23) హయాంలో మన ఊరు –మన బడి, మన బస్తీ –మన బడి ద్వారా జిల్లాలోని 426 పాఠశాలలను ఎంపిక చేసి సౌకర్యాలు కల్పించారు. ప్రస్తుత ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో మిగతా పాఠశాలల్లో అవసరమైన వసతులు కల్పిస్తోంది.

పనులు ఇలా..

2022–23లో మన ఊరు–మన బడి, మన బస్తీ–మన బడి కింద 426 పాఠశాలలను ఎంపిక చేయగా.. 275 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. మిగతా 151 పాఠశాలలను ప్రస్తుత ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కిందకు చేర్చారు. మొత్తంగా 955 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం ద్వారా పనులు పూర్తి చేయాలని నిర్ణయించి రూ.35 కోట్లు కేటాయించింది. ఈ నిధుల ద్వారా 895 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. దీంతో సుమారు రూ.23 కోట్ల బిల్లులు చెల్లించారు. మిగిలిన 60 పాఠశాలల్లోనూ పనులు చివరి దశకు చేరగా విద్యాసంవత్సరం మొదలయ్యేలా నాటికి పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. కాగా, పాఠశాలల్లో ప్రధానంగా అదనపు తరగతి గదులు, ప్రహరీలు, టాయిలెట్ల నిర్మాణం, విద్యుత్ మరమ్మతులు తదితర పనులపై దృష్టి సారించారు.

అన్ని సౌకర్యాలు

కొత్త విద్యాసంవత్సరం మొదలయ్యే నాటికి పాఠశాలల్లో పెండింగ్ పనులన్నీ పూర్తి చేయించాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ కాంట్రాక్టర్లకు సూచనలు చేస్తున్నారు. దీంతో విద్యుత్ వైర్లు, పెయింటింగ్, ప్రహరీల నిర్మాణం, చిన్న చిన్న మరమ్మతులు చకచకా సాగుతున్నాయి. ఇంతలోనే రాష్ట్ర ప్రభుత్వం 14 కేజీబీవీల్లో సైతం సౌకర్యాలు కల్పించేందుకు రూ.5కోట్లు కేటాయించగా, అక్కడ కూడా పనులు వేగంగా చేయిస్తున్నారు. ఈ పనులన్నీ పూర్తయితే కొత్త విద్యాసంవత్సరంలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సమకూరుతాయని చెబుతున్నారు.

పనులపై ప్రత్యేక దృష్టి



ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న పనులు విద్యా సంవత్సరం మొదలయ్యే నాటికి పూర్తి చేసేలా పర్యవేక్షిస్తున్నాం. అదనపు కూలీలను సమకూర్చుకుని పనులు వేగంగా చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించాం. మా ఉద్యోగులు కూడా నిరంతరం పరిశీలిస్తున్నారు.

– సామినేని సత్యనారాయణ, డీఈఓ

క్లుప్తంగా

ఎస్సైపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు


చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న తిరపయ్య

తిరుమలాయపాలెం: చోరీ కేసులో వివక్ష ప్రదర్శించి తన కుమారుడు దారమల్ల సందీప్ ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఎస్‌ఐతో పాటు ఎర్రగడ్డ గ్రామానికి చెందిన అభిలాష్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన తండ్రి తిరుపయ్య కోరారు. ఈసందర్భంగా హైదరాబాద్‌లో సోమవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు ఫిర్యాదు అందజేశారు. చోరీకేసులో ఇతర కులస్తులు ఉన్నా తన కుమారుడిని బెదిరించడంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ మేరకు ఎస్సైపై చర్యలు తీసుకోవడమే కాక తన కుమారుడికి మెరుగైన వైద్య చికిత్స అందించేలా చూడాలని కోరారు.

తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి


మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

వైరా: రాష్ట్రప్రభుత్వం తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడమే కాక అభివృద్ధి పనులకు తగిన నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. వైరాలో సోమవారం జరిగిన పార్టీ డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 20 నెలలుగా గ్రామాల్లో పాలక మండళ్లు లేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు అందడం లేదని తెలిపారు. ఫలితంగా సమస్యలు పేరుకుపోతున్నాయని చెప్పారు. ఈమేరకు ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టాలని సూచించారు. అలాగే, సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణం వేగంగా జరిగేలా నిధులు కేటాయించాలని, కారేపల్లి, కామేపల్లి ఏజెన్సీ మండలాలకు సాగు నీరు అందేలా చూడాలని కోరారు. సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్నందున నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా నిఘా పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు మచ్చా మణి, సుంకర సుధాకర్, తాళ్లపల్లి కృష్ణ, దుగ్గి కృష్ణ, కొండెబోయిన నాగేశ్వరరావు, తోట నాగేశ్వరరావు, దొంతెబోయిన నాగేశ్వరరావు, కె.నరేంద్ర, కుటుంబరావు, శ్రీనివాసరెడ్డి, రామారావు, బాలాజీ, శ్రీనివాస్, తాతా పద్మ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కూసుమంచి: కూసుమంచికి చెందిన భోగి శ్రీకాంత్(28) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భోగి వెంకన్న ముగ్గురు కుమారుల్లో చిన్నవాడైన శ్రీకాంత్ తండ్రితో ఉంటున్నాడు. ఆయన సోదరులకు వివాహాలు కాగా ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్నారు. ఈక్రమాన శ్రీకాంత్, ఆయన తండ్రి ఆదివారం రాత్రి వేర్వేరు గదుల్లో నిద్రించారు. సోమవారం మధ్యాహ్నం శ్రీకాంత్ సోదరుడి భార్య కూసుమంచి రాగా, ఇంటి తలుపులు వేసి ఉండడంతో బలంగా శబ్దం చేయడంతో మామ వెంకన్న తలుపులు తెరిచాడు. ఆమె ఇంట్లోకి వెళ్లి చూడగా చాపపై కింద పడుకున్న శ్రీకాంత్ విగతజీవిగా పడి ఉండడంతో కుటుంబీకులకు సమాచారం ఇచ్చింది. కాగా, శ్రీకాంత్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఆయన సోదరుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అర్హులైన గిరిజనులంతా లబ్ధి పొందాలి

భద్రాచలం: అర్హులైన ప్రతీ గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా, వారు లబ్ధి పొందేలా అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశం మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించాక మాట్లాడారు. అర్హతల మేరకు దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. గిరిజనులు సైతం ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని అన్నారు. కాగా, టేకులపల్లి మండలం మూర్తులతండాకు చెందిన లక్ష్మయ్య తమ పొలంలో బోరు బావికి, పెనుబల్లి మండలం గట్టిగూడెంకు చెందిన నాగేశ్వరరావు కరెంటు మోటారుకు, జూలూరుపాడు మండలం కర్రెవారి గూడెంకు చెందిన రాంబాబు ట్రికార్ రుణం కోసం, అశ్వారావుపేట మండలం అయ్యవారిగూడెంకు చెందిన కృష్ణ రోడ్లు, కరెంటు ఏర్పాట్లకు, పాల్వంచ మండలం పునుకుల గ్రామానికి చెందిన వెంకటమ్మ క్రాప్ లోన్ కోసం దరఖాస్తులు సమర్పించారు. ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, డీడీ మణెమ్మ, ఈఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,058

బహుదూరపు బాటసారులకు నీడ!

- పూర్వకాలం నుంచి రాకపోకలు సాగించే ఎందరికో ఆశ్రయం
- దెందుకూరులో సత్రం.. ఇటీవల పునర్నిర్మాణం
- కళాకారుల ప్రదర్శనలకు వేదిక కూడా...

మధిర: పూర్వకాలంలో రాకపోకలకు నడక మార్గం లేదా ఎడ్లబండ్లనే ఉపయోగించేవారు. దీంతో రాత్రి వేళల్లోనే కాకుండా మార్గమధ్యలో విశ్రాంతికి ఆగడం, అక్కడే భోజనం వండుకుని తిన్నాక ముందుకు సాగేవారు. ఇలాంటివారి కోసం వివిధ ప్రాంతాల్లో సత్రాలు ఉండేవి. కొన్నిచోట్ల భోజనానికి సైతం దాతలు ఏర్పాట్లు చేసేవారు. అలా మధిర మండలం దెందుకూరులోనూ సత్రం నిర్మించగా వేలాది మందికి ఆశ్రయం కల్పించేవారని చెబుతారు. గ్రామానికి చెందిన కపిలవాయి సీతమ్మ నేతృత్వాన సత్రం కోసం పెంకుటిళ్లు నిర్మించగా.. శిథిలావస్థకు చేరడంతో ఆమె కుటుంబానికి చెందిన సుబ్బలక్ష్మి ఆధ్వర్యాన కొన్నేళ్ల క్రితం పునర్నిర్మించారు.

రావిచెట్టు సెంటర్..

దెందుకూరులోని రావిచెట్టు సెంటర్‌లో బాటసారుల సత్రం ఉంటుంది. వందేళ్ల క్రితమే కపిలవాయి సీతమ్మ పూర్వీకులు సత్రంగా పెంకుటిల్లు నిర్మించారని చెబుతారు. అయితే, అది శిథిలావస్థకు చేరడంతో సీతమ్మ వారసులు సుబ్బలక్ష్మి తదితరులు మూడేళ్ల క్రితం అక్కడే నూతన భవనం నిర్మించి కపిలవాయి సీతమ్మ సత్రంగా నామకరణం చేశారు. సత్రం నిర్వహణ కోసం రెండు దుకాణాలను నిర్మించి అద్దెకు ఇచ్చారు. ఈ సత్రం గతంలో కళావేదికగానూ విలసిల్లింది. సాంఘిక, పౌరాణిక, చారిత్రాత్మక నాటక ప్రదర్శనలు, కళారూపాల ప్రదర్శన ఈ సత్రం వేదికగా ఇచ్చేవారట. ఇక్కడి రావిచెట్టు 150 ఏళ్ల నాటిదని పూర్వీకులు చెప్పేవారని గ్రామ పెద్దలు చెబుతున్నారు. కాగా, 1969లో తుఫాన్ వచ్చిన సందర్భంగా దెందుకూరు సమీపంలో మద్రాస్ ఎక్స్‌ప్రెస్ రైలు మూడు రోజులు నిలిస్తే ప్రయాణికులను దెందుకూరులోని ప్రతీ ఇంట ఆదరించారని చెబుతారు. అప్పటికే రావి చెట్టు పక్కన కపిలవాయి సీతమ్మ నిర్మించిన సత్రం ఎందరికో నిలువ నీడను ఇచ్చిందట. అలాగే, నడక మార్గంలో వెళ్లే ప్రయాణికులు, ఎడ్ల బండ్లపై వచ్చివెళ్లే చిరు వ్యాపారులు, సన్నకారు రైతులు ఆశ్రయం తీసుకునేవారని గ్రామంలో చెప్పుకుంటారు.



పునర్నిర్మించాక బాటసారుల సత్రం, (ఇన్‌సెట్) పురాతన రావి చెట్టు నీడన గ్రామస్తులు

రామాలయ నిర్మాణం

తొలినాళ్లలో సత్రం నిర్మిస్తుండగా చేపట్టిన తవ్వకాల్లో శ్రీసీతారాముల విగ్రహాలు బయటపడ్డాయని చెబుతారు. ఈ విగ్రహాలను సత్రానికి సమీపంలో ప్రతిష్ఠించి ఆలయ నిర్మాణం చేపట్టారు. ఆలయ నిర్వహణ కోసం కపిలవాయి సీతమ్మ 6.50 ఎకరాల భూమి, ఆంజనేయస్వామి ఆలయానికి 2.50 ఎకరాలు విరాళంగా ఇచ్చారు. శ్రీ కోదండ రామ స్వామి ఆలయానికి కుందా వెంకటేశ్వర్లు 4.07 ఎకరాలు భూదానం చేశారు. తద్వారా వచ్చే ఆదాయం ఆలయ నిర్వహణ సాఫీగా సాగుతోంది.

ఎందరికో ఉపయోగం



దశాబ్దాల క్రితం నిర్మించిన సత్రం నేటికీ ఉపయోగపడుతోంది. కపిలవాయి కుటుంబ పూర్వీకులు నిర్మించిన సత్రం పాడైపోవడంతో మళ్లీ కొత్తగా కట్టారు. వాహనాలు లేని సమయంలో నడక మార్గాన, ఎడ్లబండ్లపై వెళ్లే ప్రయాణికులు ఈ సత్రంలో వంట చేసుకుని నిద్రించి విశ్రాంతి తీసుకున్నాక వెళ్లేవారట.

– యడ్లపల్లి సంగయ్య, దెందుకూరు

సీతమ్మ వారసుల సహకారంతో..



కపిలవాయి సీతమ్మ వారసుల సహకారంతో బాటసారుల సత్రాన్ని పునర్నిర్మించారు. గతంలో పెద్ద తుపాను వచ్చినప్పుడు ఈ సత్రం ఎంతోమందికి నీడను ఇచ్చింది. ఇక్కడ సత్రానికే కాక రావి చెట్టుకు సైతం ఎంతో చరిత్ర ఉంది. అప్పటి విషయాలు, దాతల సమాచారాన్ని మా పెద్దలు తరచుగా చెప్పేవారు.

– ఐతం ప్రసాద్, దెందుకూరు

రామాలయం అభివృద్ధి..



సత్రం నిర్మాణ తవ్వకాల్లో బయటపడిన శ్రీసీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించి ఆలయ నిర్మించారు. ఆలయ నిర్వహణ ఖర్చుల కోసం సీతమ్మ కుటుంబీకులు 6.50 ఎకరాల భూమి ఇచ్చారు. మా నాన్న వెంకటేశ్వర్లు 4.07 ఎకరాల భూదానం చేశారు. ప్రస్తుతం ఈ ఆలయం దేవాదాయ శాఖ పరిధిలో ఉంది.

– కుందా పుల్లారావు, దెందుకూరు

విద్యుత్ ఫీడర్లపై ఇండికేటర్లు

- అంతరాయం ఏర్పడిన భాగాన్ని గుర్తించేలా ఏర్పాటు
- 18 ఫీడర్ల పరిధిలో 79 ప్రదేశాల్లో ఏర్పాటుకు కసరత్తు
- ఇప్పటికే మధిర – ఎర్రుపాలెం లైన్‌లో పనులు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ వ్యవస్థ సాంకేతికంగా అభివృద్ధి చెందుతోంది. మెరుగైన సరఫరా, అంతరాయాలను నియంత్రించడమే లక్ష్యంగా సంస్థ 'ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్ల'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రకృతి వైపరీత్యాలు, ఇతర సాంకేతిక కారణాలతో లైన్లలో తరచుగా అంతరాయం ఏర్పడుతుంది. ఈ సమయాన లైన్ మొత్తాన్ని తనిఖీ చేయకుండా బ్రేక్ డౌన్ అయిన ప్రాంతాన్ని గుర్తించేలా ఈ ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్(ఎఫ్‌పీఐ)లు ఉపయోగపడతాయి. వీటిని 33 కేవీ, 11 కేవీ విద్యుత్ ఫీడర్లపై ఏర్పాటు చేస్తుండడంతో సమస్య ఎదురైన ప్రాంతాన్ని గుర్తించి నేరుగా అక్కడకే వెళ్లి మరమ్మతు చేయనుండడంతో ఉద్యోగులపై భారం తగ్గుతుంది. అంతేకాక త్వరగా సరఫరా పునరుద్ధరించడానికి వీలవుతుంది.

మొదలైన పనులు

జిల్లాలో 18 విద్యుత్ ఫీడర్లలో సాంకేతికంగా అవసరమైన 79 ప్రదేశాల్లో ఎఫ్‌పీఐల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈమేరకు జిల్లాలోని మధిర నుంచి ఎర్రుపాలెం వరకు 40 కి.మీ. పొడవైన 33 కేవీ విద్యుత్ లైన్‌లో గుర్తించిన ప్రదేశాల్లో ఐదు ఇండికేటర్లు, జానకీపురం నుంచి వెలువడే గ్లోపూడి ఫీడర్‌లో మరో ఐదు ఇండికేటర్ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఖమ్మం సర్కిల్‌లో గుర్తించిన ఇతర ప్రాంతాల్లోనూ ఇండికేటర్ల ఏర్పాటుకు కసరత్తు సాగుతుండగా ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారితో కూడిన అధికారుల బృందం పర్యవేక్షిస్తుంది. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ విద్యుత్ అంతరాయం ఏర్పడిన భాగాన్ని త్వరగా గుర్తించేలా ఎఫ్‌పీఐలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తద్వారా విద్యుత్ వినియోగదారులకు ఉత్తమ సేవలతో పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు.


ఫీడర్‌పై ఎఫ్‌పీఐ ఏర్పాటుపనులను పరిశీలిస్తున్న ఎస్‌ఈ శ్రీనివాసాచారి, అధికారులు

హెచ్‌టీ సర్వీసులకు సింగిల్ విండో విధానం

ఖమ్మంవ్యవసాయం: హెచ్‌టీ(హైటెన్షన్) సర్వీసుల మంజూరు ఎన్పీడీసీఎల్ సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెట్టింది. హెచ్‌టీ 11 కేవీ, 33 కేవీ ఆపై ఓల్టేజీ సర్వీసుల మంజూరులో వేగం పెంచేలా ఈ విధానానికి శ్రీకారం చుట్టింది. ఈమేరకు 11 కేవీ ఓల్టేజీ దరఖాస్తులను సర్కిల్ కార్యాలయంలోని ఏడీఈ, 33 కేవీ, ఆపై ఓల్టేజీ దరఖాస్తులను కమర్షియల్ కార్పొరేట్ ఆఫీస్ అధికారి పరిశీలించనున్నారు. తొలుత వినియోగదారులు టీజీఎన్పీడీసీఎల్ పోర్టల్‌లో అవసరమైన పత్రాల(టీజీ ఐపాస్‌లో నమోదు కానివి) తో దరఖాస్తు చేసుకుంటే నంబర్ కేటాయిస్తారు. ఆపై అధికారులు దరఖాస్తులను పరిశీలించి ఎస్టిమేషన్ రూపొందించి, నిర్దేశిత ప్రాంతంలో సదుపాయాలను పరిశీలిస్తారు. ఆ తర్వాతత అంచనాలతో కూడిన అనుమతులను మంజూరు చేస్తారు. ఈ విషయమై ఎస్‌ఈ శ్రీనివాసాచారి మాట్లాడుతూ హెచ్‌టీ సర్వీసులను త్వరగా మంజూరు చేసేలా అమల్లోకి తీసుకొచ్చిన సింగిల్ విండో విదానంతో వినియోగదారులకు పని సులువవుతుందని తెలిపారు.

దివ్యాంగుడిని ఆదుకోండి..

మధిర: రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబంలో జన్మించిన దివ్యాంగుడిని ఆదుకోవాలని ఆయన తల్లి కోరుతోంది. మధిర ఎంప్లాయీస్ కాలనీకి చెందిన ముత్తారపు చిరంజీవి – శారద దంపతులకు దివ్యాంగుడైన కుమారుడు శ్రీనివాస్, కుమార్తె శివాని ఉన్నారు. చిరంజీవి కొన్నేళ్లుగా ఆటో అద్దెకు తీసుకుని నడిపిస్తుండగా, ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఉపాధి దూరమైంది. దీంతో శివాని చదువు భారంగా మారింది. దీనికి తోడు దివ్యాంగుడైన శ్రీనివాస్‌కు వచ్చే రూ 4వేల పెన్షన్ ఆయన బాగోగులకు సరిపోవడం లేదని చిరంజీవి దంపతులు వాపోతున్నారు. పుట్టుకతో కాళ్లు, చేతులు పనిచేయని శ్రీనివాస్‌కు 28ఏళ్లు వచ్చినా ఏ పని చేసుకోలేని స్థితి కావడంతో ఎవరో ఒకరు పని మానుకుని ఇంటి వద్దే ఉండాల్సి వస్తోంది. కనీసం సొంత ఇల్లు కూడా లేని తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడమే కాక, కేర్ టేకర్ వేతనం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.


లేవలేని పరిస్థితిలో శ్రీనివాస్

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

చింతకాని: కందకం తీస్తుండడాన్ని ప్రశ్నించడంతో దాడి చేసిన ముగ్గురిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మండలంలోని సీతంపేటకు చెందిన చంద్రకాని మల్లయ్య వ్యవసాయ భూమి పక్కనే జేసీబీ సాయంతో ఈదర శ్రీనివాసరావు మూడు అడుగుల కందకాన్ని తీయిస్తున్నాడు. ఈ విషయం తెలిసిన మల్లయ్య వెళ్లి కందకం ఎందుకు తీస్తున్నారని అడగడంతో శ్రీనివాసరావు, ఆయన భార్య సునీత, బావమరిది నాగేశ్వరరావు కలిసి దాడి చేశారు. ఈ ఘటనతో గాయపడిన మల్లయ్య ఫిర్యాదు చేయగా ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

డాక్టర్ రాగమయి !


చిన్నారిని పరీక్షిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: నిత్యం తనిఖీలు, సమీక్షలతో గడిపే సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సోమవారం స్టెతస్కోప్ పట్టుకున్నారు. సత్తుపల్లి ఏరియా ఆస్పత్రికి వచ్చిన ఆమె నర్సింగ్ కళాశాల, అంబేద్కర్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆతర్వాత మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి శిశువులు, బాలింతలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశాక కొందరు చిన్నారులను స్వయంగా పరీక్షించారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు గాదె చెన్నారావు, ఎం.డీ.కమల్‌పాషా, పింగళి సామేలు, జీవన్ పాల్గొన్నారు.

కేంద్రం, ఏపీ ప్రభుత్వాలవి ఫాసిస్ట్ చర్యలు

మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: ఈనెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల మృతదేహాలను బంధువులకు అప్పగించకుండా కేంద్రంతోపాటు ఏపీలోని కూటమి ప్రభుత్వం ఫాసిస్ట్ చర్యలకు పాల్పడుతోందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కమిటీ సహాయ కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మృతదేహాలకు బీజేపీ, టీడీపీ ప్రభుత్వాలు భయపడుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా మృతదేహాలను బంధువులకు అప్పగించి.. గౌరవప్రదంగా అంత్యక్రియలు జరిగేలా చూడడంతో పాటు నిర్బంధం, బెదిరింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కాగా, ప్రభుత్వాలు, పోలీసుల వైఖరి గమనిస్తే మావోయిస్టులను పట్టుకొచ్చి కాల్చి చంపినట్లుగా వస్తున్న వార్తలను విశ్వసించాల్సి వస్తోందని తెలిపారు. మధ్య భారతంలో నరమేధం సృష్టిస్తున్న పాలకులు, సరిహద్దుల్లో చేయాల్సిన యుద్ధం దండకారణ్యంలో చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్లు, ఆదివాసీల మరణాల పై న్యాయ విచారణచేయాలని రంగారావు డిమాండ్ చేశారు. మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు గోకినేపల్లి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్స య్య మాట్లాడగా నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, గుండమళ్ల రామయ్య, ఝా న్సీ, మలీదునాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోటు రంగారావు, పక్కన నాయకులు

రేపు జాబ్‌మేళా

ఖమ్మం రాపర్తినగర్: నిరుద్యోగ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈనెల 28న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన శాఖ అధికారి ఎస్.మాధవి తెలిపారు. ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జరిగే జాబ్‌మేళాకు 18–25 ఏళ్ల వయస్సు కలిగి, ఎస్ఎస్‌సీ నుండి డిగ్రీ వరకు విద్యార్హతలు ఉన్న వారు హాజరుకావొచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఉదయం 10గంటలకు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో రావాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి


నాగరాజు (ఫైల్)


కృష్ణకుమార్ (ఫైల్)

వేంసూరు: ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ బాలుడు సహా ఇద్దరు మృతి చెందారు. వేంసూరు మండలంలో చోటు చేసుకున్న ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జయలక్ష్మీపురం గ్రామానికి చెందిన నగరకంటి నాగరాజు(38), ఆదివారం సాయంత్రం ఆదే గ్రామానికి చెందిన బొల్లిపోగు కృష్ణకుమార్(12) తీసుకుని ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. జయలక్ష్మీపురం నుంచి కొండెగట్ల ప్రధాన రహదారి వద్దకు వెళ్తుండగా మార్గమధ్యలోని కొండెగట్ల చెరువు మూలమలుపు వద్ద ద్విచక్ర అదుపు తప్పి కింద పడ్డాక రహదారిపై రాసుకుంటూ వెళ్లి ఎదురుగా కూలీలతో వచ్చిన ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన నాగరాజు ఘటనాస్థలిలోనే మృతి చెందగా కృష్ణకుమార్‌ను ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు, అక్కడి నుంచి ఖమ్మం, ఆపై హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుల్లో కృష్ణ కుమార్ ఆరో తరగతి చదువుతుండగా, నాగరాజుకు కుమారుడు, కుమార్తె ఉన్నా రు. ఘటనపై కృష్ణకుమార్ తండ్రి ముత్తారావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరప్రసాద్ తెలిపారు.

వాహనం ఢీకొని మహిళ...

వైరా: రోడ్డు దాటుతున్న మహిళను టాటా ఏస్ ఢీనడంతో తీవ్రగాయాలపాలై మృతిచెందింది. వైరా యాదవబజార్‌కు చెందిన లక్ష్మి(52) సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద రోడ్డు దాటుతోంది. ఇదేసమయాన ఖమ్మం వైపు నుంచి వైరా వైపు వస్తున్న టాటా ఏస్ ఆమెను ఢీకొనడంతో తీవ్రగాయాలు కాగా స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. లక్ష్మికి ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉండగా, కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.రామారావు తెలిపారు.

లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు...

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి సమీపాన సోమవారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టగా ఓ వ్యక్తి మృతి చెందాడు. ఖమ్మం దివ్యాంగుల కాలనీకి చెందిన షేక్ అఫ్జల్‌పాషా(40) సెంట్రింగ్ మేస్త్రీ కాగా, సోమవారం పందిళ్లపల్లిలో ఓ ఇంటి నిర్మాణ పనులు మాట్లాడుకుని తిరిగి వెళ్తున్నాడు. ఈక్రమంలో గ్రామ సమీపాన వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో కింద పడిన ఆయన పైనుంచి లారీ వెనుక టైరు వెళ్లగా అఫ్జల్ అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, ప్రమాద సమయంలో ఖమ్మం నుంచి పందిళ్లపల్లి వస్తున్న మేకల నాగేశ్వరరావు తన బైక్‌తో అఫ్జల్ పాషా వాహనాన్ని ఢీకొట్టడంతో ఆయనకు సైతం గాయాలయయ్యాయి. ఈ గటనతో రెండు వైపులా రాకపోకలు నిలిచిపోవడంతో పోలీసులు చేరుకుని రాకపోకలను క్రమబద్ధీకరించారు. కాగా, అఫ్జల్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..


సూదా కృష్ణయ్య (ఫైల్)

తల్లాడ: తల్లాడ మండలం లక్ష్మీనగర్ వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మండలంలోని అన్నారుగూడెంకు చెందిన సూదాకృష్ణయ్య(53) ఆయన భార్యకు మాత్రలు తీసుకొచ్చేందుకు ఆదివారం అర్ధరాత్రి మోటార్ సైకిల్‌పై తల్లాడ వస్తుండగా లక్ష్మీనగర్ వద్ద గేదెలు అడ్డు రావడంతో వాటిని తాకి కింద పడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను 108లో ఖమ్మంకు, అక్కడి నుంచి హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బి.కొండల్‌రావు తెలిపారు.

గేదెను ఢీకొని వాహనదారుడు..

దమ్మపేట: గేదెను బైక్ ఢీకొట్టిన ఘటనలో గాయపడిన వ్యక్తి తీవ్రగాయాలతో మృతి చెందాడు. సత్తుపల్లి మండలం రేగళ్లపాడు గ్రామానికి చెందిన కూరం చంటి(36) తన బైక్‌పై దమ్మపేట మండలంలోని అంకంపాలెం వైపునకు సోమవారం రాత్రి వెళ్తున్నాడు. అయితే, గండుగులపల్లి శివారుకు చేరుకునే సరికి చీకట్లో రోడ్డుపై గేదెను గమనించక ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చంటి అపస్మారక స్థితిలోకి వెళ్లగా స్థానికులు సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చంటి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్లు అరెస్ట్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఫణీందర్

ఖమ్మంక్రైం: ఆన్‌లైన్‌లో ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్‌లో డబ్బు పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మించి రూ.1.62కోట్లు కాజేసిన అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్లను ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. బోనకల్ మండలానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఆన్‌లైన్ ట్రేడింగ్ లాభాల పేరిట నమ్మించారు. దీంతో ఆయన రూ.1.62కోట్లు చెల్లించగా.. ఆపై ముఖం చాటారు. దీంతో సదరు వ్యక్తి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించగా, సీపీ సునీల్‌దత్ పర్యవేక్షణలో విచారణ చేపట్టారు. తొలుత ఏపీలోని విజయవాడ ప్రాంతానికి చెందిన షేక్ సుభానీని అదుపులోకి తీసుకుని విచారించగా ఎన్టీఆర్ జిల్లాకు చెందిన దాసరి సునీల్‌కుమార్, సుదలగుంట్ల సాయికృష్ణ కూడా ఈ మోసంలో ఉన్నట్లు తేలింది. ఈమేరకు ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, కేసు విచారణలో కీలకంగా వ్యవహరించిన సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణీందర్, సీఐ యాసిన్‌అలీ, ఎస్‌ఐలు రంజిత్, విజయ్‌కుమార్, సిబ్బందిని సీపీ అభినందించారు.

సన్నబియ్యం దందా మొదలు..

తిరుమలాయపాలెం: రేషన్‌షాపుల్లో దొడ్డు బియ్యంకు బదులు ప్రభుత్వం సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. దీంతో లబ్ధిదారులంతా బియ్యం సొంతానికి వాడుకుంటారని, తద్వారా అక్రమాలు జరగవని భావించారు. కానీ అది తప్పని తేలిపోయింది. తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 13.5 క్వింటాళ్ల సన్న రేషన్ బియ్యాన్ని సోమవారం పోలీసులు గుర్తించారు. గ్రామానికి చెందిన వడ్డెబోయిన నరేష్ ఇంట్లో పిండిప్రోలుకు చెందిన వ్యాపారి మడికంటి రామయ్య బియ్యం నిల్వ చేశాడు. ఈ సమాచారంతో పోలీసులు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. అయితే, సదరు వ్యాపారి బియ్యాన్ని లబ్ధిదారుల వద్ద కొన్నాడా, డీలర్ల నుంచి సేకరించాడా తేలాల్సి ఉందని సమాచారం.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

వైరా: అతి వేగంగా వెళ్తూ డివైడర్‌ను ఢీకొట్టగా కారు బోల్తా పడింది. ఏపీలోని కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం ఆర్బీ.కొత్తూరుకు చెందిన మన్నెక సత్యనారాయణ, దేవప్రసాద్ కారులో సోమవారం కాకినాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్నారు. ఈక్రమాన వైరా పాత బస్టాండ్ సమీపంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ, దేవప్రసాద్‌కు స్వల్పంగా గాయపడడంతో స్థానికులు వారిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు.


వైరాలో బోల్తా పడిన కారు